# సీతా ఓ సీతా!



దేవిప్రియ

నవ్యధోరణి నాటిక !

ఇది జరిగిన కథ కాదు, జరగడానికి అవకాశం వున్న కథ కూడా కాదు-జరుగుతున్న కథా ? అవును. ఒక విధంగా జరుగు తున్న కథే యిది. విలువలు విడిచి విసిరేసిన వలువల కంటే చులకనైపోతున్న నేటి పరిస్థితుల్లో నలుగురు చేరి దేన్ని నంది అంటే అదే నంది అవుతోంది.

# వార్త

'బెంజీ' ఆంగ్ల చిత్రం చూసిన వారు - ఆ చిత్రంలోని నాయకుడు 'బెంజీ' (కుక్క) 'నటన' మరచిపోవడం చాలా కష్టం. ఆ కుక్క-చిత్రాలలోను,టి. వి. కార్యక్రమాలలోను 'నటించడం' ద్వారా యింతవరకు 75 మిలియన్ల పౌండ్లు ఆర్జించింది! 'బెంజీ' ఎక్కడకు వెళ్ళాలన్నా, మొదటితరగతిలో ప్రయాణం, ఖరీదైన హోటళ్ళలో బస, ఖరీదైన ఆహారంతప్పనిసరిగా వుండా లట. 'బెంజీ' ఒక్కసారి స్టేజి మీద ప్రేక్షకులకు కనిపించడానికి, ఆ కుక్క యజమాని ఐదువేల పౌండ్లు వసూలు చేసాడట!

అవాస్తవికపు ఆలోచనల చుట్టూ ఈనాడు మనుషులు ఆశల వలలు అల్లుకొంటున్నారు.
ఎవరి ప్రయోజనాల కోసం వాళ్ళు తపిస్తున్నారు.
మేధావులు మెదడు లేనట్టు వ్యవహరిస్తున్నారు.
జనం ప్రచారాల ప్రభంజనంలో పడికొట్టుకు పోతున్నారు....
నాగరికత పేరిట, వేలం వెర్రిగా కొత్త వింతల వెంటపడడం ఎక్కువై పోయింది.
ఈ తొక్కిసలాటలో తమ జీవిత సత్యాలను తామే తొక్కి చంపుకొంటున్నారు....
ఇది మనసులో వుంచుకొని .... ఈ ప్రతీకవాద నాటిక చదవండి.

## సీతా, ఓ సీతా!

(తెర తీయగానే, చీకటిగా వున్న రంగస్థం క్రమంగా కాంతివంతమవుతుంది. గోడమీద పెద్ద సైజులో సీత బొమ్మ ఒకటి. అందంగా చిత్రించబడి వుంటుంది. గోడగడియారం కొత్త మోడల్‌ది, రంగు రంగుల టెలిఫోన్లు నాలుగు, ఫర్నిచర్-టేబుల్-చాలా పెద్దది- కుర్చీలు కొన్ని వుంటాయి. భుజాల మీంచి పట్టీలు వేలాడే ప్యాంటు యిన్‌షర్టు చేసి, చేతిలో పొగలు కక్కుతూన్న పైపుతో

రామ: కవా? కొంపతీసి మన ఓట్లు ఫ్రాడు కాదు గదా. పంపించమ్మా (ఫోను పెట్టేస్తాడు మరొక ఫోను మోగుతుంది. రిసీవర్ తీసుకొంటాడు.)

హల్లో— ఆఁ ఆఁ నేనే-సీత స్నానం పూర్తయిందా వెరీగుడ్ టబ్‌లో డెట్టాలూ సెంటూ కలపడం మరిచిపోలేదుకదా — గుడ్- చినబాబుగారు తయారయ్యారా — వెరీగుడ్— రెడీ

### ఇందులో....

| | |
|---|---|
| రామచంద్రుడు | - ఒకప్పుడు నాటకాల కాంట్రాక్టర్ - వయసు 45 పైన. |
| చినబాబు | - 10-12 సంవత్సరాల మధ్య. స్కూలు విద్యార్థి. |
| అమ్మాయి (గెస్ట్) | - 8-10 సంవత్సరాల మధ్య. చినబాబు చెల్లెలు. |
| కవిగారు | - ....... |
| భూపతిరాజు | - నాటకాల కాంట్రాక్టర్లకి పెట్టుబడులు పెట్టే మొరటు ధనికుడు. |
| సెక్రటరీ | - 80 సంవత్సరాలు - రామచంద్రుడి ఆఫీసు సెక్రటరీ |

### కంఠస్వరాలు

రిసెప్షనిస్ట్ (లేడీ) - మినిష్టర్స్ పి. ఎస్. - సిప్పీ వగైరా

కాలం: వర్తమానం స్థలం: హైదరాబాదు

కాంట్రాక్టర్ రామచంద్రుడు ప్రవేశిస్తాడు. లోపలినుంచి టెలిఫోన్ బజర్‌కి సమాధానంగా టెలిఫోన్ ఎత్తుతాడు.)

రామ: యేస్- రామచంద్రుడు

రిసెప్షనిస్టు: ఎవరో కవిగారట. మిమ్మల్ని చూడాలంటున్నారు సార్.

గున్నారా-దట్స్ గుడ్.

(కవిగారు వచ్చారు బయటినుంచి)

(కవిగారిని చూసి ఆశ్చర్యంతో ఆనందంతో ఫోను పెట్టేసి ఆహ్వానించాడు)

కవి: నమస్కారం రామచంద్రుడు గారూ, నేను గుర్తున్నానంటారా!

రామ : నువ్వు మా సీస పద్యాల కవివి కదూ. కొంప ముంచావు గదయ్యా! రా, రా, రా? ఏమయ్యావూ, ఇన్నాళ్లూ ఎక్కడున్నావు?

కవి : మన ఎంసవీ కన్యకాపరమేశ్వరీ నాటక సమాజం మూతపడి, మీ దారిన మీరూ, ఆర్టిస్టుల దారిని ఆర్టిస్టులూ చెల్లా చెదరై పోయేక నా అగచాట్లు ఏమని చెప్పమంటారు లెండి.

రామ : అప్పుడప్పుడూ, ఆ [illegible] తలుచుకుంటే నా ఒళ్ళు గగుర్పొడుస్తోంది.

కవి : తిరగని వూరులేదు. పడని కష్టం లేదు. ఇన్నాళ్ళకి, మీ పేరు పేపర్లలో, రేడియోలో మారుమోగడం చూసి అసలు ఈ రామచంద్రుడు మా ఆ రామచంద్రుడు అవునో కాదో చూసి పోదామని వచ్చా! అంతా బావున్నట్టే కదా!

రామ : మా సీత దయవల్ల అంతా సజావుగానే సాగిపోతోందయ్యా.

కవి : రామచంద్రుడుగారూ ఏమిటండీ ఈ చిత్రం - ఈ సీతేమిటి, పాటకి దాని ఆటేమిటి, జనానికి ఈ వేలం వెర్రేమిటి, ఈ కనక వర్షమేమిటి, ఇది కలా, వైష్ణవ మాయా?

రామ : కల కాదు కవిగారూ, ఇది కటిక నిజం. నాటకాల కంపెనీ పెట్టి, వున్న నాలుగు రాళ్లూ కురుక్షేత్రమనీ, సతీ సక్కుబాయనీ, రామాంజనేయయుద్ధమనీ అలా పోడు చేసుకున్నాను. భార్యా పిల్లల్ని పస్తుల పడుకో పెట్టా ... దిక్కు తోచక పిచ్చివాడిలా తిరిగాను. అనాథలా అల్లాడిపోయాను ఒకరోజు... ఒకరోజు - గుంటూరులో.... కాళ్ళీడ్చుకుంటూ. రోడ్డుమీద పడిపోతూండగా, వేణువు మీద మధుర మధురంగా ఒక పాట .. (రంగస్థలమంతా చీకటై పోతుంది. రంగస్థలం ఫ్రంట్ లో వెలుగు. అక్కడ (ఆర్. ఎఫ్ లో) ఒక బాబు సిగరెట్ పెట్టెతో చేసిన తబ్బామందు మోకాళ్ళమీద కూర్చుని వేణువు వాయిస్తూ వుంటాడు. పక్కన అదే వయసులో వున్న మరొక అమ్మాయి కూడా వుంది. రామచంద్రుడు నెమ్మదిగా అటు నడిచాడు. బట్టలు మాసిపోయి, పంచె చిరుగు పడివుంది?

రామ: ఏమిటి నాయనా అది.

(వాడు వేణువు ఆపడు. అమ్మాయి [illegible])

అమ్మా: పాట.

రామ: ఎవరు నాయనా నువ్వు?

అమ్మా: మా అన్నయ్య.

రామ : నీ పేరేమిటి బాబూ?

అమ్మా: చినబాబు.

రామ: ఎవరు తల్లీ నువ్వు.

అమ్మా: మా అమ్మ కూతుర్ని, అన్నయ్య చెల్లెల్ని, ఇంకా యేమైనా వుందా అడగాల్సింది?

రామ: సిగరెట్టు పెట్టెలో పాము పిల్లేమైనా వుందా యేమిటి?

అమ్మా: ఇంకా నయం ఏనుగు గున్నుందన్నారు కాదు. అది మా సీత,

రామ : సీతా! ఏదీ చూడనీ,

అమ్మా: పిల్లేదండీ! అది పిల్లలకి మాత్రమే. పెద్దవాళ్ళంటే మా సీతకి తగని సిగ్గు. (ఊదుతున్న పాటని—నా స్లోని తన్ డోలే మేరె మన్ డోలే——మధ్యలో ఆపి చినబాబు లేచాడు. అతని చేలో భద్రంగా ఆ పెట్టె వుంది )

రామ: ఎక్కడ నేర్చుకున్నావు నాయనా యింత పాత పాట!

చి. బా: మా పాత గ్రామ్ ఫోను దగ్గిర నేర్చుకున్నానండీ, బాగుందా?

రామ: బాగుండడమేమిటీ, అమోఘంగా వుంది. అవునూ, ఆ పెట్టెలో ఏముంది నాయనా?

చి. బా: సీత!

అమ్మా: నేను చెపితే కోస్తున్నాననుకున్నారా యేమిటి?



రామ: ఒకసారి నేను చూడొచ్చా.
చి. బా: నేను తప్ప ఎవరు ముట్టుకున్నా వూరుకోదండీ.

రామ: ఇంతకీ ఏమిటి నాయనా అది?
చి. బా: చూడండి.

రాము: (చిన్నబాబుని చూసి) శాస్త్రి - పీత! పీతటయ్యా సీతంటే! ఇదేం అలవా టయ్యా ఇంగ్లీషు సినిమాల్లో విలన్ లాగా! పిలెవంత లేవు.

అమ్మా: ఇది ఆషామాషీ పీత కాదండీ — డ్యాన్సు చేసే పీత. చూడండి, చూడ డానికే ఎంత అందంగా వుందో, మా సీత. దీని తెలివితేటల్ని గురించి యేం చెప్పమంటార్లెండి — మా అన్నయ్య ఫ్లూట్ అలా ఊదాడంటే చాలు, జయమాలిని లాగా ఝామ్మని డాన్సు చేస్తుంది తెలసా?

రామ: పీత డాన్సాడుతుందా? ఇటువంటి విడ్డూరం ఎక్కడైనా వుందా? నేను నమ్మను.

చి. బా: నమ్మకపోతే నారాయణగూడ వెళ్ళండి. సీత డాన్సు చేసేది నా కోసమే. ఇదేమైనా టిక్కెట్ల నాటకం అనుకున్నారా యేమిటి?

రామ: (తనలో) "ఎంత దెబ్బకొట్టాడు!" (అనుకుని) అదేం మాటలు నాయనా - అద్భుతమైన విషయం గదా—చూసి తరిద్దామని అడిగాను. ఏది బాబూ, ఒక్కసారి వేణువు వినిపించు మంచి బాబువి కదూ—

(చిన్నబాబు పెట్టె కింద పెట్టి ఫ్లూట్ వాయించాడు మళ్ళీ—అదే ట్యూను)

రామ: ఓసి దీం దుంప తెగ. నిజంగానే ఆడుతున్నదయ్యా, అరె అరె అరెరే. బాబూ. ఫ్లూట్ ఒకసారి ఇలా ఇవ్వు - శభాష్ - (రామచంద్రుడు తనకి వచ్చిన రెండు మూడు పాత ట్యూనులు - ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడు. జగమే మాయ వంటివి వాయించాడు. సీత ఆడలేదు) అరే, నేను వాయిస్తే ఆడదే ?

అమ్మా: సాక్షాత్తూ సాలూరి రాజేశ్వరరావుగారే వచ్చి వాయించినా మా సీత కాలు కూడా కదపదు.

అ: నేనే వాయించాలి. అది కూడా నాగిన్ ట్యూన్నే వాయించాలి.

రామ. చిత్రంగా వుందే (స్వగతంగా) కాలువ గట్ల బొరియల్లో, సముద్రం వొడ్డున ఇసుకతిన్నాల్లో, చాటుగా చల్లగా పడి వుండే పీత సంగీతానికి కదిలి ఆడడ మేమిటి ఈ సంగతి ప్రపంచానికి తెలిస్తే ఏమన్నా వుందా, అమ్మో, నా ఇల్లు రంజయ్యే బ్యాంకయిపోదూ - పాత నాటకాలమీద రోతపుట్టి, కొత్త సినిమా లంటే ముఖం మొత్తి వున్న జనం ఈ కొత్త వింత మీదికి వెర్రిగా ఎగబడ తారు. రేడియోలో, పత్రికల్లో, టెలివి జన్‌లో వీలైతే సినిమాల్లో. అమ్మా, కన్యకాపరమేశ్వరీ, చల్లగా చూడు- బాబూ, ఈ పీతని...

అమ్మా: పీతేమిటండీ, సీత అనలేరూ.

రామ: అదే అదే, సీతని నా కిచ్చేయరాదూ, అంతా పోగా అయిదు రూపాయలు మిగిలి వున్నయ్. బోలెడు చాక్లెట్లూ, చూయింగమ్ములూ కొనుక్కోవచ్చు.

న.బా: చేత్బోలు చెరువుగట్టు కెళ్ళండి, బోలెడు దొరుకుతాయి.

రామ: అన్నీ ఇలా అవతాయా! పురుషులలో పుణ్యపురుషులున్నట్టే పీతలలో కూడా పుణ్య పీతలుంటాయని ఇప్పుడే జ్ఞానో దయమైంది బాబూ!

అమ్మా: అయిందిగా, ఇక దయచేయండి, (అమ్మాయి, చినబాబు నిష్క్రమిస్తారు.)

రామ ఓయ్ చినబాబూ, అమ్మాయ్, మీ ఇంటి కొచ్చి మీ నాన్నగారితో మాట్లాడ తాను, సీత భద్రం! సీతా, సీతా, నా సీతా... (పిల్లలు వెళ్ళిన వింగ్ లోకే రామచంద్రుడు కూడా వెళ్ళిపోతాడు. "సీతా, ఓ సీతా!" అని రంగస్థలం పలుసార్లు ప్రతి ధ్వనించింది...... (ఇక్కడే నాటిక పేరు-ఇతర క్రెడిట్స్ చెప్పవచ్చు, కొన్ని క్షణాల తరువాత రంగస్థలమంతా లైటొస్తుంది. రామ

తంద్రుడు తోలి ముస్తుల్లో. యథా స్థానలో వుంటాడు- కవి కూడా)

కవి : అలా మలుపు తిరిగిందన్న మాట కాంట్రాక్టర్ రామచంద్రుడి కథ.

రామ : మలుపు కాదు కవీ, అలుపు. ఎంత అలసిపోయానో, ఈ జనం మూర్ఖత్వాన్ని సొమ్ము చేసుకోవటంలో ఎంత శ్రమపడ్డానో నీకు తెలియదు- చినణాలు తల్లిదండ్రులకి నచ్చచెప్పి, ఆ కుర్రాడి పరీక్ష లయ్యే వరకూ అక్కడేపడి వుండి, ఈ కంపెనీ తెరవడానికి పెట్టుబడి కోసం మళ్ళీ భూపతి కాళ్ళే పట్టుకుని...

కవి : (ఉలిక్కిపడి) ఏమిటీ, భూపతిరాజుని మళ్ళీ దగ్గరికి చేర్చారా? వాడు నిలువెల్లా కోరలున్న కొత్తరకం పామన్న సంగతి మరిచిపో... ....
(ఫోను మోగుతుంది)

రామ : హలో.

రిసె : (ఫిల్టర్) బొంబాయినుంచి జె. కె. బనియన్స్ వాళ్ళ కాల్ సార్.

రామ : సెక్రటరీ యింకా రాలేదమ్మా.

రిసె : (ఫిల్టర్) ఇప్పటికి మూడుసార్లు ఫోను చేసారు సార్, వాళ్ళ బనియన్ల మీద మన సీత బొమ్మ వేసుకొనే విషయమై అగ్రిమెంటు చేసుకోడానికి మిమ్మల్ని రమ్మంటున్నారు సార్

రామ : ఈ బిల్డింగులోనే వున్న బొమ్మల ఫ్యాక్టరీ వాళ్ళ అగ్రిమెంటు మీద సంతకం చేయడానికే తీరిక లేకపోతే, బొంబాయి కెళ్ళి సైన్‌చేయడం ఎలా కుదురుతుంది?

రిసె : (ఫిల్టర్) వాళ్ళకి ఏం చెప్పమంటారు సార్.

రామ : సార్‌కి టైమ్‌లేదు, సెక్రటరీ తో మాట్లాడి వేరే ఏర్పాటు చేసుకోమని చెప్పు- (ఫోన్ పెట్టేశాడు.)
చచ్చిపోతున్నాననుకో ఈ అగ్రిమెంట్లతో-
(సెక్రటరీ ప్రవేశించాడు)

సెక్ర: క్షమించండి సార్, పూరాయ నిముషాలు ఆలస్యమైంది—

రామ : ఇరవైనాలుగు గంటలూ ఇక్కడే పడివుంటావు, నీకు టైమేమిట్లే—కానీ, ఆ బొంబాయి బనీనాళ్ళ గొడవేమిటో తొందరగా చూతరాదూ, ఫోనుమీద ఫోనుచేసి చంపేస్తున్నారు.

సెక్ర: [illegible] సార్, [illegible] నుంచి టూరిస్టు బస్సులదాకా, అందరూ మన సీత బొమ్మకోసం అగ్రిమెంట్లు రాసి అడిగినంత ఇవ్వడానికి రెడీగా వున్నారు సార్, కలకత్తా చూయింగ్ గమ్ కంపెనీ వాళ్ళు అగ్రిమెంటు పొడిగించమని కోరుతూ బ్లాంక్ చెక్ పంపించారు సార్. ఇంకా....హాలెండ్ నుంచి స్టాండర్డ్ డైరీవాళ్లూ, జపాన్ నుంచి సోనీ కంపెనీవాళ్లూ, మారిషస్ నుంచి సీ ఫుడ్ ప్రొడక్ట్స్ వాళ్లూ.... (కవిని గమనించి) వీరెవరు సార్, వీరికి కూడా అగ్రిమెంటు కావాలా?

రామ : కాదు లేవయ్యా. ఈయన కవిగారు. మనకి కావలసినవారు.

కవి : చాలా సందడిగా వుంది. కడు సంతోషంగా వుంది. కడుపు నిండి పోయింది.

రామ : మరిచేపోయాను! సెక్రటరీ!

సెక్ర: సార్.

రామ : కవిగారికి వెంటనే వుండడానికి, రూమూ అదీ చూపించి భోజనానికి ఏర్పాటు చేయి.


సెక్ర: మన గెస్టురూము ఖాళీగానే వుంది సార్.

రామ : వెళ్ళి రావయ్యా కవీ, స్నానం కానిచ్చి, భోజనం ముగించుకునిరా పో-

సెక్ర: పదండి, పదండి ఎన్ని రోజులయిందో ఏమో...

కవి : ఏమిటి, స్నానం చేశా, ఖలేవారండీ!
(ఇద్దరూ లోపలికి వెళ్లారు)

రామ : సీతా ఓసీతా!




(భూపతి రాజు బయటినుంచి వస్తూనే)

భూ : ఏమిటయ్యా రామచంద్రుడు గారూ, సీతా సీతా అని పట్టపగలే కలవరిస్తున్నావ్, కొంపదీసి ఆ సీతని లవ్వాడేస్తున్నావా యేంది?

రామ : నువ్వా భూపతీ!

భూ . నేనేనయ్యా మొగుడా– రాక తప్పుద్దా!

రామ ; అందవలసిన పైకం పూర్తిగా అందగానే నేనే వస్తానని చెప్పానుగా–

భూ : అంటే నేనీడికి రాకూడదనా నీ ఉద్దేశం! ఓయ్ రామసెంద్రుడుగోరూ అప్పుడే మరిసిపోయినావంటయ్యా పాతరోజులు. అవ్వవలసిన దాంటో ఆవగింజంత కాలేదు.

రామ : ఇప్పుడవన్నీ ఎందుకు భూపతీ. నీ దగ్గర తీసుకున్న డబ్బు వడ్డీతో సహా యిస్తానంటున్నా గదా.

భూ: వడ్డీ యేందయ్యా వడ్డీ, ఎవుడిగ్గావాల్నయ్యా వడ్డీ! ఈ యాపారానికి పెట్టుబడి పెట్టింది నేను. పేపర్లో, రేడియోల్లో టాం టాం యేయడానికి నీ దగ్గర నయాపైసాకూడా లేనప్పుడు యాభై వేలు ఎనకా ముందూ చూడకుండా నీ చేతుల్లో పెట్టింది నేను.

రామ: నువ్వు సాయం చేయలేదని నే నెన్నడికీ అనను. కానీ, సీతా ఎంటర్ప్రయిజెస్‌లో సగం వాటాకోసం నువ్వు ఆడుతున్న నాటకాలు మాత్రం సాగ

నీయను.

భూ: మొత్తానికి కాంట్రాక్టు నాటకాల బుద్ధి పోనిచ్చుకున్నావు కాదయ్యా — సెల్లియో సెల్లకో పజ్జేంకి గిరాకీ తగ్గి సిల్లిగవ్వకి కాకుండా పోయి నోడివి - ఈ అయ్యోల ఇలాగ ఈస్టు మను కలియు సినిమాలాగ ఎరిగిపోతున్నావు - ధనం నాది-దశ నీది.

రామ: ఇప్పుడిప్పుడే నాలుగు డబ్బులు చేరుతున్నాయి. అప్పుడే నీ కన్ను పడిందా?

భూ: పైరుమీద పడితే యేం లాభమయ్యా, కన్ను పడితే భూమిమీదే పడాలి కానీ.

రామ: ఏమన్నావ్?

భూ: ఇంకా యేమీ అనందే — ఇప్పుడంటున్నాయిను చెప్పేది జాగర్తగా ఇనుకో ఇప్పుడు నీ దెగ్గరున్న సీత మామూలు నీటి పురుగు గాదు. అది సాచ్చాత్తూ మాలచ్చిమి అవతారం. అచ్చిమి మా కులదేవత. అది నా నట్టింట వుంటకమే నేయం. నువ్వు రాసిచ్చిన నోటు నీ కళ్ళముందేఇప్పుడేఇక్కడే చించిపారేతా (ప్రామిసరీనోటు తీసి చేతితో పట్టుకుంటాడు) అదనంగా, యింకోయాభై యేలు నీ పేర బేంకిలో యేస్తా.అడిగితే, ఆ తుక్కర కుంకకి కూడా యింకో పదో పదిహేనో పారేతా — యిచ్చేయి - సీతని నా కిచ్చేయి రామసెంద్రుడూ, యిచ్చేయి.

రామ: (వెర్రిగా) భూపతిరాజూ - అది నా కలల పంట. నా ఆశల దీపం - ఆర్పేయా లనుకొంటున్నావా దాన్ని - పో బయటికి - నడువు — బయటికి - పోరా.

భూ: పోతా - కానీ - మళ్ళీ వత్తా, సీతకోసం, నా ధనలచ్చిమి కోసం.
(వెళ్ళిపోయాడు)

రామ: సీతా, నా సీతా... (ఆవేశంతో బిగ్గరగా అరిచాడు. "సీతా ఓ సీతా" కోరస్ ఆడ, మగ గొంతుకలతో ప్రతిధ్వనించింది. రంగస్థలం క్రమంగా చీకటితో నిండిపోయింది,
రంగస్థలం మీద వెలుగు పరుచుకుంది. రామచంద్రుడు విస్కీ సీసా టేబుల్ మీద పెట్టుకుని గ్లాసుతో తాగుతున్నాడు. సిగరెట్ కాలుస్తున్నాడు. చినబాబు అందంగా తయారై వచ్చాడు. చేతిలో వేణువు, అందమైన చిన్న గాజుపెట్టె వున్నాయి. గాజు బాక్సులో "సీత" వున్నదన్నమాట. చి. బా. వేణువు ఆలపిస్తూ వచ్చాడు. రామచంద్రుడి పరిస్థితి చూసి ఆశ్చర్యపోయాడు).

చి.బా: అంకుల్, ఏమిటిది....

రామ: రిహార్సల్ మాత్రం కాదు. ఏకంగా నాటకమే.


చి.బా: సినిమాల్లో తాగినట్టు ఇలా తాగితే అందరూ యేమనుకుంటారు- ఒళ్ళు స్వాధీనంలో ఉంటుందా?

రామ: సీత కిక్కెక్కి వున్న నాకు ఆఫ్టరాల్ - ఈ విస్కీ ఒక లెక్కా-
(సీసా ఎత్తుకుని గడగడ తాగేస్తాడు)

చి.బా; (కంగారుగా) అంకుల్, అంకుల్ -

రామ: ఇష్ష్ష్- ష్ష్. ష్ష్- నువ్వేమీ భయపడకు. నాటకాలాడించేరోజుల్లో బండి లేటయి మాదో కృష్ణుడు రాక పోతే, నాటు బిగించి, అరున్నర సుతిలో ఎత్తుకునేవాణ్ణి చూడూ— జెండాపై కపిరాజు- జెం....డాపై కపిరాజు.... చూ కావా.... కనక, మనకీ ఈ కల్తీ సరుకు ఏమీ కదల్చలేదు... ఓరేయ్, భూపతీ, దుష్టదుశ్శాసనా, భ్రష్ట దుర్యోధనా, కుటిల కీచకా, పీచ మణచలేక పోయిన నేను భీమచంద్రుడనే—
(సెక్రటరీ ,కవి ప్రవేశించారు)

సెక్ర: ఈ రోజు ప్రోగ్రాముల సంగతే మరిచి పోయినట్టున్నారేం సార్. తీరికగా ఏకపాత్రాభినయం చేస్తు




న్నారు.

రామ : నువ్వు చెపితే గదయ్యా కార్యక్రమం.

కవి : కవి సమ్మేళన మేమైనా వుందా ఈరోజు కార్యక్రమంలో—

చి.బా: కొంపదీసి మీరు మైకాసురుడు కాదు గదా!

కవి : మైకాసురుడా, అదేవిటి నాయనా—

చి.బా: పురాణాల్లో కాకాసురుడిలాగా, స్టేజి మీద మైకు పట్టుకుని వదలని వాళ్ళని మైకాసురులంటారు లెండి మా వూళ్ళో.

సెక్ర: చూశారా సార్, వచ్చిన కొత్తల్లో గవర్నమెంటు ఆఫీసులో ఫైల్లాగా పడి వుండే వాడు. ఇప్పుడు తెలుగు సినిమా క్లయిమాక్స్‌లాగా ఎలా పేట్రేస్తున్నాడో—

రామ : అంతా ఆ సీత మహిమ.

చి.బా: ఆ సీతకాదు అంకుల్. నా సీత, నా సీత (పెట్టెని ముద్దెట్టుకుంటాడు) సీత నా ప్రాణం అంకుల్.

రామ : (విననట్టు) ఆఁ సెక్రటరీ, ఇవాళ ఫస్టు ప్రోగ్రామేమిటి?

సెక్ర: పదకొండు గంటలకి సెక్రటేరియట్‌లో కేబినెట్‌తో సీత గ్రూప్ ఫొటో వుంది సార్, దీని కోసం మద్రాసు నుంచి ప్రత్యేకంగా ఫొటోగ్రాఫర్ని పిలిపించారు—

కవి : ఏం, హైదరాబాదులో ఫోటోలు తీసే వాళ్ళు దొరకరా—

రామ: ఇది హైదరాబాదు కాదయ్యా బాబూ, హైదరాబాధ. పోనీయివాళ కాస్త బాధ పడదాఁలే అనుకున్నా, సమయానికి ఆ బాధకూడా దొరకదు. ఆఁ తరవాత..

సెక్ర: ఉగాండా నుంచి సీతని చూడడానికి వచ్చిన సాంస్కృతిక బృందంతో ఇంటర్వ్యూ, పన్నెండింటికి.

కవి : ఉగాండా నుంచా.

రామ: ఎందుకలా అట్లా ఉలిక్కి పడ్డావ్

చి. బా: ఉగాండాని మొన్నటి దాకా యేలిన ఇడీ అమీన్ మనుషుల్ని తినే వాడటలే అంకుల్.

రామ: ఎంత పిరికివాడివయ్యా కవీ. సెక్రట్రీ నెక్ట్స్ నెక్ట్స్-

సెక్ర: మధ్యాహ్నం రెండింటికి రేడియోలో సీతకి సంబంధించిన శ్రోతల ప్రశ్నలకి మీ సమాధానాలు.

రామ: అంతా రెడీగా వుంది కదా-ఆ తరవాత-

సెక్ర: బిజినెస్ వ్యవహారాలు - సాయంత్రం అయిదు గంటలకి అఖిలభారత జంతు శాస్త్రజ్ఞుల సమావేశంతో, సీత ప్రత్యేక లక్షణాలని గురించి చినబాబు ఉపన్యాసం-

కవి: ఏవిటేవిటీ; ఆలిండియా జువలజిస్ట్స్ కాన్ఫరెన్స్ లో ఈ పిల్లవాడి ప్రసంగమా?

రామ: మనకి పిల్లవాడేనయ్యా, దేశానికి మేధావి బురదగుంటల వెంట, సముద్రం గట్ల వెంటా పడి పురుగుల్ని తింటూ పురుగులా బతికే ఒక మామూలు పీతకి నాట్యం నేర్పడానికి నరావతార మెత్తిన నారాయణుడు అని పత్రికల్లో రాసి సీ యెత్తు ఫొటోలు కూడా వేశారు మా యువరాజువి. తెలుసా?

కవి: ఔరా, కలికాలం.

సెక్ర: కలికాలం కాదు, శీతాకాలం కాదు! ఇది సీత కాలం! సార్ ఇవాళ్టి పోస్టు కూడా మీరూ, చినబాబుగారూ ఇంకా చూళ్ళేదు—

చి.బా: మీరు, చూసేయండి అంకుల్. సీతకి బిస్‌వాటర్ టైమయింది.
(వెళ్ళాడు లోపలికి)

రామ: గుడ్. అలా ఉండాలి ప్రేమంటే! ఏదయ్యా చదువు ఉత్తరాలు- చదివే వుంటావు కదా- పాయింట్సు చెప్పేయి త్వరత్వరగా-

సెక్ర: ఎస్సార్! ముఖ్యమైన విషయాలు చెపుతానుసార్! మద్రాసు చిన్నయ్యదేవర్ ఫిలింస్ నుంచి లెటరొచ్చింది సార్.

రామ: చిన్నయ్య దేవర్ ఫిలింస్ నుంచా, ఏమన్నారయ్యా వాళ్ళు,ఏం రాశారేం?

సెక్ర: మనం చెప్పిన రేటు కొంచెంఎక్కువగా వుందట సార్. తగ్గించే అవకాశం వుంటే రాయమన్నార్సార్-

రామ: (నిరుత్సాహంతో) రేటెక్కువగా వుందన్నారా? ఈ కాంట్రాక్ట్ కుదురుతుందని బోలెడు ఆశలు పెట్టుకున్నానయ్యా-

సెక్ర: రెండు లక్షలకంటే ఎక్కువగా ఇవ్వడం కుదరదంటున్నారు సార్. మన సీత కనిపించవలసిన సీన్లు చాలా వుంటాయని కూడా స్పష్టంగా రాశారు సార్-

రామ: నాలుగు లక్షలడిగితే రెండు లక్షలే యిస్తామంటున్నారా....

కవి: ఏవిటి ... రూపాయలే ఇవన్నీ...?

రామ: రూపాయలేం కర్మయ్యా కవీ, నా సీత రత్నాలు కురిపిస్తుందయ్యా- ఇటువంటి అగ్రిమెంటు ఒకటి దొరికితే చాలునయ్యా, దీనికోసమేనయ్యా నేను ఎదురుచూస్తున్నది...

సెక్ర: సార్, ఇంకా చాలా ఉత్తరాలున్నాయి సార్.... ఇటలీ నుంచి "లా స్టాంపా" పత్రికవాళ్ళు, ఫ్రాన్సు నుంచి "లెఫిగారో" పత్రికవాళ్లు, జపాన్ నుంచి "అసహిషింబున్" పత్రిక ఎడిటరూ ఇంకా జర్మన్‌నుంచి "డీవేల్ట్", స్విట్జర్లాండ్ నుంచి "జేటుంగ్"-ఇలా చాలా పత్రికలవాళ్లు సీత జీవిత కథ ప్రచురించుకోడానికి రైట్స్ కావాలని అడుగుతున్నారు సార్.

రామ: నాలుకు లక్షలు...

సెక్ర: ఒక ఉత్తరం చైనా నుంచి కూడా వచ్చింది సార్.




రామ : నాలుగు లక్షలు, తరువాత నలభై లక్షలు. ఆ తరవాత నాలుగు కోట్లు- సీతా, నా సీతా.

(లోపలికి వెళ్ళాడు నెమ్మదిగా, మరొక లోకంలో అడుగులేస్తూ)

కవి : సీత పెద్ద సినిమా స్టారయ్యేటట్టుండే మండీ సెక్రటరీగారూ

సెక్ర: చెప్పాను గదటండీ, ఇది మామూలు సీతకాదని. మా సీత సినిమా స్టారు తాత!

కవి : పిదప కాలం పిదప బుద్ధులూ- సీత ధ్యాస్పడడమేమిటి, ఆ పిల్లవాడికి మచ్చిక కావడమేమిటి, దగ్గిరకిపోతే కొండేలతో పట్టుకు పీకుతుందని భయ పడి చస్తామే, ఏమిటండీ ఈ చోద్యం, ఆఁ.

సెక్ర: అది అర్థంకాకనే కదండీ దేశంలోని మేధా వులూ, డాక్టర్లూ, సైంటిస్టులూ అంతా బుర్రలు బద్దలు కొట్టుకొంటున్నదీ।

కవి : సినిమాలంటే పడి చచ్చే జనం తారల్ని వదిలి, సీతా సీతా అని ఈ సీత వెంట పడడం, రేడియోలో రోజుకొక్క సారైనా సీత సంగతి వినపడకపోతే శ్రోతల సంఘాలు ఆందోళనచేయడం!

(ముగింపు వచ్చే సంచికలో)

# సీతా ఓ సీతా!



దేవిప్రియ

పద్యధోరణి నాటిక ।

## (గత సంచిక తరువాయి)

సెక్ర : స్కూలు పిల్లల చొక్కాలమీద, కాలేజీ అమ్మాయిల బనియన్లమీద, క్రికెట్ బ్యాటులమీద, కారు అద్దాలమీద.

కవి : అందుగల డందులేదను సందేహమువలదు. హుఁ.... సెక్రటరీగారూ దేశం యేమైపోతుందో తెలియడం లేదు.

సెక్ర : కొత్తలో నేనూ యిలాగే ఆలోచించాను సార్! యిదొక వరద. దానికి అడ్డుపడి కొట్టుకుపోవడంకంటే, ఒడ్డున నిలిచి యేం జరుగుతుందో చూడడం మేలని యిలా పక్కకి జరిగాను.

కవి : అంతేలెండి. నాటకాలమీద విసుగెత్తి సినిమాలమీద పడ్డారు. సినిమాల మీద విసుగుపుట్టి యిలాంటి కొత్తపింతమీద పడుతున్నారు........ దే ఆర్ క్రేజీ. పీతకాదు, వానపామును తెచ్చి, యిలా ప్రచారం చేసినా యింత వ్యామోహమూ పెంచుకొంటారు జనం.

సెక్ర : ఏంచేస్తారండీ, వీళ్ళకి సెన్సేషన్ కావాలి. కాంగ్రెస్ పోవాలి. జనతా రావాలి. మత్తొదలాలి. మెలకువ రావాలి, మేలుకొని యేంచేయాలో తెలియదు .... యిదేమిటి, పనిమానేసి నేనేదో ఇంటలెక్చువల్ డిస్కషన్‌లోకి దిగినట్టున్నాను... వస్తానండీ... పనివుంది బయట, అయిదు నిమిషాల్లో వచ్చేస్తాను. (ఫోను తీసి) హల్లో, రిసెప్షన్, సెక్రటరీ హియర్, నేను బయటికి వెళుతున్నాను. ఏమైనా ట్రంక్ కాల్స్ వుంటే పెండింగ్‌లో వుంచు. అయిదు నిముషాల్లో వస్తాను. (బయటికి వెళ్ళాడు త్వర త్వరగా)

కవి : సినిమాలు చెడిపోయాయని వ్యంగ్య కవిత్వం రాశాను. చూడగా జనం పుర్రెలమీదే వెర్రితలలు మొలుసున్నట్టున్నాయి....(ఫోను మోగింది. కవి మొదట కాస్త కంగారు పడ్డాడు. తరవాత రిసీవర్ యెత్తాడు) హల్లో, హలో,

రిసె : (ఫిల్టర్) దేర్ ఈజ్ ఎ కాల్ ఫ్రమ్ కువాయిట్ సర్.

కవి : నేనండీ కవిగారిని. రిసెప్షనిస్టు కాదా....కువాయిటా ? కువాయిట్ నవాబుగారి సెక్రటరీయా? ఏట్, వాట్?

రిసె : రిసెప్షనిస్టునే సార్! కువాయిట్ నవాబుగారు, సీతకోసం స్పెషల్‌గా కుషన్ పరుపొకటి చేయించి పంపుతున్నారటసార్. సాయంత్రం ఫ్లయిట్‌లో వస్తోందట.

కవి : (ఫోను పెట్టేసి) పీతకోసం కువాయిట్‌నుంచి కుషను పరుపా, మనిషికి చింకిచాపకి గతిలేనిదేశంలో....పీతకి కుషను పరుపులా ?
(మళ్ళీ ఫోను మోగింది. ఎత్తాడు) హల్లో, హల్లో-రిసెప్షనిస్టా, ఏం తల్లీ ఈసారి ఈజిప్టు ప్రెసిడెంట్‌గారు పీత స్నానం కోసం నైలునది నీళ్ళేమైనా పంపించారా?

రిసె : (ఫిల్టర్) కాదండీ, ప్రజ్ఞాపూర్ పటేలు రామచంద్రుడుగారితో మాట్లాడతారట.

కవి : పొటేలు ఫోనులో మాట్లాడుతుందా!

రిసె : (ఫిల్టర్) పొటేలు కాదండీ, పటేల్, పటేల్.

కవి : ఓహోహో, పటేలా, రామచంద్రుడుగారు లోపలున్నారమ్మా....తరవాత మాట్లాడమను. (ఫోను పెట్టేశాడు. మళ్ళీ మోగింది. తీశాడు.)

కవి : ఏం తల్లీ, ఏమైంది మళ్ళీ!

రిసె : సార్, సీత బాగుందా సార్,

కవి : ఈ ఆఫీసులోనే పనిచేస్తున్నావుగా, నీకూ ఎక్కిందా పిచ్చి?

రిసె : అవేం మాటలు సార్, మా కాలనీలో "సీత అభిమాన సంఘాని"కి నేనే సార్ సెక్రటరీని.

కవి : ఉద్ధరించావు....



రోసి: చినబాబుకి సీతంటే ప్రాణం సార్, చినబాబు పాడితేనేగానీ సీత ఆడదు సార్!

కవి: పెంచినప్రేమకదా పాపం.

రోసి: అంతే సార్!

కవి: పెట్టెయ్యమ్మా, అరక్కతక్క ఒక పేపర్వాళ్ళు ఒక పద్యం అడిగారు. రాసుకోవాలి. (ఫోను పెట్టేస్తాడు.) కవిత్వం, కవిత్వం, అవును- ఇంత డబ్బు రాబోతోంది రామచంద్రుడికి కుర్రవాడికి కారుకూడా కొంటానంటున్నాడు. అప్పులు తీర్చబోతున్నాడు — తెలివితేటలు బోలెడన్ని వున్నాయి. డబ్బు సంపాదించాలనే ఆశ నావాడికి అధికమవుతోంది. ఏం- ఈ వెర్రిలో రామచంద్రుడు సినిమా యెందుకు తీయకూడదు. తీస్తాడు! కొత్తరకం సినిమా తీస్తాడు. సినిమావాళ్ళ దగ్గర వ్యాపారుల దగ్గర సంపాయించిన డబ్బుతో, డబ్బు ఎక్కువైన ప్రతివాడూ చేస్తున్నట్టు రామచంద్రుడుకూడా సెవెంటీ ఎం. ఎం. సినీమా తీసిపారేస్తాడు. నేను.... నేనే ఆ సినీమాకి కథామాటలూపాటలూ రాస్తాను. సినిమా కవినైపోతాను.... (ఆవేశం తగ్గి....కాసేపు ఆగి) ఏమైంది నాకు.... నేనునేనేనా?....ఏం?ఎందుకు కాకూడదు...సినిమా కవులంటే ఆకాశంనుంచేమైనా వూడిపడతారా? అవుతాను, రామచంద్రుడు తీయబోయే సినిమాకి రాయబోయే కవిని నేనే-నేనే. సీతాచరితం కవి నేనే. సీతా ఓసీతా-

(లోపలికి వెళుతూవుండగా, రామచంద్రుడు బయటకివస్తూ "కవిగారూ, కవిగారూ అని పిలుస్తాడు." కవి ఆగిపోయాడు. ఇద్దరూ మైమ్‌లో వుండగా లైట్స్ డిమ్మవుతాయి. వ్యాఖ్యాత కంఠం వినబడుతుంది.)

వ్యాఖ్యాత: సీతా, ఓ సీతా;

ఏకాకీ గృహ సంత్యక్తః
పాణిపాత్రో, దిగంబరః,
సోపి సంవాహ్యతే లోకే
తృష్ణాయా పశ్య కౌతుకం!

ఏకాకిగా వున్నవాడూ, ఇల్లూవాకిలి విడిచిపెట్టినవాడూ, భిక్షాపాత్ర ధరించి బతుకుతున్నవాడూ (సన్యాసి) శరీరం మీద గడ్డ అనవసరంగా భావించే దిగంబరుడూ కూడా దురాశకి లోనవుతారట—

నోరులేని పిట్టమీద, ఏకారణంచేతనో, అశేష జీవరాశిలో యెక్కడో యే మూలనో వుండే అసాధారణ శక్తిని సంతరించుకున్న పిట్టచుట్టూ ఎంతమంది ఎన్ని ఆశలు పెంచుకున్నారు- ఎన్ని వలలు పన్ని వుంచారు. సొంతదారులనుంచి దౌర్జన్యం ప్రయోగించైనా తీసుకువెళ్ళి తన సొంతం చేసుకుందామని ఒకడూ, తన అనుభవంతో నేర్పుతనంతో సీతని జనానికి ఆరాధ్యదేవతగా మార్చి ప్రజల మూర్ఖత్వాన్ని సొమ్ము చేసుకోవాలని ఒకడూ, సీత సంపాదించిన డబ్బు సహాయంతో సినిమాకవి అయిపోదామని ఒకడూ, సీతమీద జనానికి యేర్పడిన వెర్రి అభిమానాన్ని వీలైనన్ని రకాలుగా వాడుకొని లాభాలు సంపాదించాలని వందలాది వ్యాపారుల - ఇందరిమధ్య పిట్టని సీతగా మార్చి, దానికి నాట్యం నేర్పి ప్రాణంలో ప్రాణంగా చూసుకునే చినబాబు, చినబాబు-చేతుల్లోనే కానీ నిదపోలేని సీతా, ఓ సీతా, సీతా, ఓసీతా, కోరస్ సీతా,ఓసీతా,!

(అరనిమిషంపాటు రకరకాల రంగులు మారుతున్న తెరమీద సీత బొమ్మ తెరమీద వెలుగు నిండింది. ఆరిపోయింది. ఒకరాత్రి గడిచినసూచన. తెల్లవారింది- రామచంద్రుడు ఫోనులో మాట్లాడుతున్నాడు.)

రామ : చెప్పొద్దుగదండీ, సీతకి ఖ్యాతి
కొంచెం వింతగా వుంది. డాక్టర్లు పరీక్ష
చేసి మందులిచ్చి వెళ్ళారు. ఆఁ ఆఁ
నాగేశ ప్రకాశ్‌గారేగా. రాణీ ఫిల్మ్స్ వి.వి.
ప్రోగ్రాంతో పార్టిసిపేట్ చేయడానికి
రెండు మూడు రోజులు పడుతుందేమో..
జనం ఉత్తరాలు రాసి చంపేస్తున్నా
రంటారా, ఏమిటీ, ఢిల్లీనుంచి మీ డైరె
క్టర్ జనరల్ కూడా ప్రాణాలు తోడే
స్తున్నాడా? సారీ అండీ,....అలాగే-
తప్పకుండా....రెండు రోజుల తరవాత
ఒకసారి రింగ్ చేయండి....అలాగే,
అలాగే, నమస్కారం.

(ఫోను పెట్టేశాడు. మళ్ళీ మరొకటి
మోగింది. తీశాడు.)

హలో, ఎస్ ప్లీజ్, రామచంద్రుడూ
హియర్, ఏమిటమ్మా, బొంబాయి
నుంచా! సిప్పీయ? సీతా, నా సీతా-
యివ్వమ్మా, త్వరగా యివ్వమ్మా.
హల్లో, ఆఁ ఆఁ రామచెంద్రజీ—హాఁ
సాబ్, తోడాతోడా మాలుమ్ హైఁ
సాబ్, హాఁ హాఁ క్యూఁనహీఁ జరూర్
మిలేంగాఁ సాబ్. నెక్స్ట్ ఫిలింమే-అచ్ఛీ
బాత్ హై సాబ్, తీన్ మహినేకా కామ్-
పాంచ్....పాంచ్....క్యా కహా సాబ్-
పూరే పాంచ్ లాక్....మెహర్బానీ
సాబ్, ఆవూంగా సాబ్ కల్హీ ఆవూంగా
బంబయీ.

(ఆనందతో కేకలేస్తాడు)

సీతా, ఓ సీతా, సీతా, నా సీతా, చిన
బాబూ, నా చినబాబూ, కవీ, సెక్రె
టరీ....రండి. రండోయ్ రండి. రండి.
(అందరూ వచ్చారు.)

చి. బా : ఏమిటంకుల్ హడావిడి?

సెక్రె : ఏమైంది సార్, మద్రాసుపార్టీ నాలుగు
లక్షల కొప్పుకున్నారా?

రామ : వెర్రి సెక్రెటరీ వినవయ్యా—మద్రాసు
వాళ్ల మూడులక్షలు మూడుసార్లు సీత
చుట్టూ తిప్పి అవతల పారేయవయ్యా!
బొంబాయినుంచి ఆయుటంత లిస్టునసి
పెద్ద పార్టీ వచ్చిందయ్యా!

కవి : అయితే సినిమా తియడానికి అంతా
సిద్ధమైపోయినట్లేనా-?

రామ : అయిపోయినట్లే కవీ, అంతా అయి
పోయినట్లే, చినబాబూ, నా బంగారు
కొండా, నా వరాలమూటా, వెళ్ళు,
వెళ్ళి మన సీతని తీసుకురా...మనం
వెంటనే బొంబాయి బయలుదేరి వెళ్ళాలి
యింకా సేపట్లో. పదపద....

చి. బా. : ఇప్పుడే తీసుకొస్తానంకుల్.

రామ : సెక్రటరీ, అర్జంటుగా ఫోనుచేసి
బొంబాయి ఫ్లైటుకి రెండు సీట్లు బుక్
చేయి. సీతా ఎంటర్‌ప్రయిజెస్‌నుంచని
చెప్పు. భూపతిరాజుకి రేపొచ్చి డబ్బు
తీసుకెళ్ళమని కబురుచెయ్యి. సీత
లోకల్ ప్రోగ్రాములన్నీ కేన్సిల్
చేసేయ్.

కవి : సిప్పీ అంతటివాడు సీతని ప్రధాన
పాత్రగా పెట్టి సినిమా తీస్తున్నప్పుడు
యింకా చిల్లరబేరాలెందుకులే.అయిదు
లక్షలు! ఒక సీత మూడునెలల సంపా
దన అయిదు లక్షలు.

రామ : అయిదు లక్షలు—అయిదు లక్షలు—
సీతా, సీతా-ఓ సీతా.
(సీతా ఓ సీతా కోరస్ వినిపిస్తుంది)
కోరస్ సాగుతుండగా అంకుల్ అని
చినబాబు పెట్టిన కేక బిగ్గరగా వినిపి
స్తుంది. అంతా నిశ్శబ్దమైపోతుంది.
"అంకుల్. సీత కనిపించడ లేదం
కుల్" అని మళ్ళీ చినబాబు పెద్దగా
అరుస్తాడు. అందరూ బొమ్మల్లా వుండి
పోతారు. మరుక్షణంలో రామ
చంద్రుడు....)

రామ : అబద్ధం. అంతా అబద్ధం. సీత కనిపి
స్తుంది. గాలి వెళ్ళే గాజు పెట్టెలో
వుంచిన సీత ఎక్కడికి వెళతుంది?!
ఏమై పోతుంది.

(చినబాబు వెక్కివెక్కి ఏడుస్తూ ఖాళీ గజ్జె పెట్టెతో వస్తాడు)

చి బా. : అంకుల్, నా సీత, నా సీత కనిపించడంలేదంకుల్. (కొన్ని క్షణాల నిశ్శబ్దం తరవాత. సీతా, ఓ సీతా అని అరుచుకొంటూ నలుగురూ రెండు ద్వారాలనుంచీ లోపలికి వెళతారు. సీతా, ఓ సీతా కోరస్‌తోపాటు "ఎక్కడున్నావు సీతా, ఏమైపోయావు సీతా" అని అరనిముషం వినిపిస్తుంది. రంగస్థలమంతా చీకటిగా వుండగా, సీత బొమ్మమీద మాత్రమే వెలుగు వుంటుంది. కోరస్ ఆగిపోయింది. ముందు చినబాబు వెక్కిళ్ళమధ్యనే యేడ్చుకుంటూ, అటూయిటూ, నేలమీదా వెతుక్కుంటూ వచ్చాడు. అతని చేతిలో వేణువుంది. మరొకవైపునుంచి రామచంద్రుడొచ్చాడు. మనిషిలో జీవం లేదు.)

రామ : అంతా వెదకావా చినబాబూ?

చి. బా. : నాగదీ, మీగదీ, అంగుళం అంగుళం వెదికానంకుల్. సీత....సీత కనిపించలేదంకుల్.

రామ : కనిపించలేదా-మన సీత కనిపించలేదా బాబూ—, లేదు బాబూ, సీత వెళ్ళిపోలేదు చినబాబూ, నన్ను విడిచి వెళ్ళినా అది నిన్ను విడిచి వెళ్ళలేదు బాబూ. ఏదీ ఒక్కసారి నీ వేణువుమీద ఆ పాట అను. ఎక్కడవున్నా, సీత పరుగెత్తుకుంటూ వస్తుంది బాబూ....
(చినబాబు నాగిన్ ట్యూను వాయిస్తూ స్టేజీ అంతా తిరుగుతాడు. నీరసపడిపోతాడు. నిరుత్సాహపడతాడు. మోకాళ్ళమీద కూలబడతాడు.)
(సెక్రటరీ, కవీ వస్తారు లోపలనుంచి)

సెక్ర : స్నానాల గదులూ, పక్కనున్న ఆఫీసులూ కూడా వెదికాం సార్.

కవి : సీత కనిపించలేదు రామచంద్రుడు గారూ.

రామ : సీతా, నా సీతా....భూపతీ నీ కళ్ళు చల్లబడ్డాయా? నీ కోరిక తీరిందా.... వాటా యివ్వలేదని నా నాటక సమాజాన్ని నాశనం చేశావు, కష్టపడి కట్టుకున్న ఈ గూటినికూడా కూల్చివేశావా!
(భూపతి కంగారు కంగారుగా ప్రవేశించాడు)

భూ : ఏందయ్యా, రామసెంద్రుడూ యేందయ్యా ఈ గోరం?

కవి : కుత్తుక కోసిన చేత్తోనే నెత్తురు తుడవడాని కొచ్చావా నాయనా?

భూ : సీత కనిపించడంలేదని యిని కంగారుపడి నేను పరుగెత్తుకొస్తే, నువ్వేందయ్యా కవిత్వం మాట్లాడతండావూ! ఏందయ్యా సెక్రట్రీ, పోలీసు రిపోర్టియ్యక అట్ట నోరుతెరుసుకు సూత్తన్నావు-కానీకానీయ్. యిదేమైనా కోడిపిల్లంటనయ్యా, పొదిగితే మళ్ళీ పుట్టడానికి.
(సీతా-సీతా-సీతా కోరస్ సాగుతుంది రంగస్థలమంతా చీకటయింది. పోలీసుకార్లు సైరన్లు మోగిస్తూ తిరుగుతున్న శబ్దం. వివిధ పత్రికల గొంతులు యిలా వినిపిస్తాయి.)

ఆంధ్రపత్రిక :
హైదరాబాదు, మే, 6. అపురూపమైన నాట్య భంగిమలతో యావద్దేశాన్ని ఆకర్షించిన సీత అనే పేరుగల పీత గత రాత్రినుంచి కనిపించడంలేదు. దీనికోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి :
హైదరాబాదు, మే, 6 జలచరాల జాతిలో సాధారణంగా కనిపించని ప్రతిభతో సంగీతానికి ప్రతిస్పందిస్తూ అశేష కళాభిమానుల అభిమానాన్ని చూరగొన్న సీత అనే పెంపుడు పీత నిన్నటినుంచి అదృశ్యమై దేశంలో తీవ్రమైన కలవరం కలిగించింది.



రేడియో :

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం: ఒక ముఖ్య ప్రకటన. నాగిన్ సంగీతానికి నాట్యంచేయడమేగాక, యిటీవలనే, చిత్రనిర్మాత సిప్పి నిర్మించనున్న తదుపరి చిత్రంలో ఒక ప్రధాన పాత్రకి ఎన్నికైన సీత అనే పెంపుడు పిల్ల నిన్నటినుంచి కనిపించడంలేదు. సీత మీ చుట్టూనే ఎక్కడైనా వుండవుండవచ్చు. సీత మీకు కనిపిస్తే వెంటనే ఈకింది చిరునామాకు తెలియచేయవలసిందిగా కోరుతున్నారు. సీతగుర్తులు! ఎర్రని నాజూకైన శరీరం. అత్తరుస్నానానికి అలవాటుపడివుండడంచేత తీయని కమ్మని వాసన, కాళ్ళకి కాశ్మీరు మాజీ మహారాజు బహూకరించిన ఉంగరాలు. (ఫేడవుట్)

(తెరమీద డిమ్‌గా లైటు వుంటుంది. సెక్రటరీ, రామచంద్రుడూ, భూపతీ, కవీ తలా ఒక దిక్కున వుంటారు. ఫోను మోగుతుంది. సెక్రటరీ వెళ్ళి తీస్తాడు.)

సెక్ర : హలో, సీతా ఎంటర్‌ప్రయిజెస్.

ఫోన్ : (ఫిల్టర్) నమస్కారమండీ - సీత ఆచూకీ యేమైనా తెలిసిందాండీ?

సెక్ర : లేదండీ యింకా. ప్రయత్నం చేస్తున్నాం.

ఫోన్ : "సీతాన్వేషణ సంఘం" అని విజయవాడలో ఒక సంఘం యేర్పాటు చేశామండీ; నిధులు సేకరిస్తున్నాం. సీతని వెతకడానికయ్యే ఖర్చులో ఎక్కువ భాగం మేమే భరించగలమనిపిస్తోందండీ! అడక్కుండానే ఒక్కపూటలో అయిదువేలు వచ్చాయి

సెక్ర : చాలా థ్యాంక్సండీ. నమస్కారం. (ఫోను పెట్టేశాడు. మళ్ళీ ఫోను తీశాడు.) హలో-హోమ్ మినిస్టర్ గారి పి. ఎ గారా! .... నమస్కారమండీ-ప్రత్యేక సహాయం యేమైనా కావాలేమో కనుక్కోమన్నారా మినిస్టరుగారు, వారి దయకి కృతజ్ఞతలు చెప్పండి. మా చేతనైంది మేము చేస్తున్నాం మీరూ ప్రయత్నంచేయండి. సీత ఈ దేశసంపద ప్రతిష్ఠ, అది తెలుగువారి గౌరవం! (ఫోను పెట్టేశాడు రామచంద్రుడు దైన్యంగా చూశాడు. చినబాబు టేబుల్‌మీద నుంచి కాళ్ళు వేలాడేసి కుంగిపోయి కూర్చుని వున్నాడు. పోలీసుకార్ల సైరన్ మోతలు పెద్దగా, ఎక్కువగా వినిపిస్తున్నాయి. సెర్చిలైట్ల వెలుగులు రంగస్థలాన్ని కాంతితో తడిపివేస్తున్నాయి. సీతా-ఓ సీతా కోంన్, నాగిన్ ట్యూను ఫ్లూటుమీదా, ఒకదాని తరవాత ఒకటి దూరంగా వినిపిస్తున్నాయి. సీతా-ఓ సీతా కోంన్ డిసాల్వ్ అవుతుండగా మళ్ళీ ఫోను మోగింది. రామచంద్రుడు యాంత్రికంగా ఫోను తీశాడు.)

ఫోను : (ఫిల్టర్) కుడ్ ఐ స్పీక్ టు మిస్టర్ రామచంద్రుడు ప్లీజ్-

రాము :-ఎవరు మాట్లాడుతున్నారు? - హూ ఈజ్ దట్ ప్లీజ్?

ఫోను : సిప్పి ఫ్రమ్ బాంబే, స్పీకింగ్, డు యు హియర్ మి?....రామచంద్రుడు జీ హై... (డిస్టర్‌బెన్స్) అభీతక్ వేసహీ ఆయేథే... రామచంద్రుడూ జీ హై...

రామ . లేడు, రామచంద్రుడు లేడు. వాడు నిన్నటితో వెళ్ళిపోయాడు. రామచంద్రుడి కథ సమాప్తమైపోయింది.

(కవి పరిగెత్తుకుంటూ వచ్చాడు.)

కవి . సీత దొరికింది. సీత దొరికింది!

రామ : ఏమంటున్నావ్ కవీ!

చి. బా. : నా సీత కనిపించిందా ?

కవి : ఔను. వనసు వుంచబట్టలేక చినబాబు గదిలోకి వెళ్ళి మళ్ళీ వెదికాను-పరుపుకింద పడుకొనివుంది.

భూ : తప్పదియ్యా, తాడు తెంపింది గదయ్యా (రామచంద్రుడు, చి. బా. ఖాళీ గాజు పెట్టె తీసుకుని లోపలికి పరిగెత్తారు. లోపలినుంచి, "సీతా, నా సీతా అని యిద్దరూ ఆనందంతో వేసిన కేకలు వినిపిస్తాయి. అరనిముషంలో బయటికి వచ్చారు పెట్టెతో.

రామ : సెక్రటరీ, సిప్పీగారికి ఫోన్‌చెయ్యి. పత్రికలలో, రేడియోలో ఆనౌన్స్ చేయించు-సీత కనిపించిందని. (సెక్రటరీ కదలడు. నిశ్చేష్టుడై నిలబడి వుంటాడు. రామచంద్రుడు పెట్టెని భద్రంగా టేబుల్ మీద పెడతాడు.) సీతా, తల్లీ, నా లక్ష్మీ, నా అయిదు లక్షల లక్ష్మివమ్మా సీతా, ఓ సీతా (అయిదు లక్షలు, అయిదు లక్షలు అని పదిసార్లు వైబ్రేటింగ్ సౌండ్ వినివస్తుంది.)

చి. బా. : సీతా, నా బంగారు సీతా నేనేమైపోతాననుకున్నావే పిచ్చితల్లీ- (టేబుల్ మీంచి వేణువు తీసుకొని వాయిస్తాడు. సీత ఆడదు. మళ్ళీ ఆలపిస్తాడు. అది కదలదు.) అంకుల్ సీత ఆడడంలేదేమి టంకుల్?

రామ : ఏమిటిబాబూ నువ్వనేది ?

కవి : నిద్రమత్తు ఒదల్లేదేమో.

భూ : కాస్త లోకంలోకన్నా రానీ

సెక్ర : (మౌనం)

చి. బా. : (మళ్ళీ వాయించాడు. ఫలితం లేకపోయింది.) ఏమైంది సీతా, నావేణువు నీకు నచ్చడంలేదా, నా పాట వినీ వినీ విసుగొచ్చిందా, నువ్వు ఎందుకాడడంలేదు సీతా?!

రామ : అదేరంగు, అదే సువాసన, కాళ్ళకి అవే బంగారు రింగులు, అదే సీత.

సెక్ర : కాదు సార్, సీత కాదు. ఇది మామూలు పీత.

రామ : అయిదు లక్షలు - ఇది నా అయిదు లక్షల సీత కాదా.


చి. బా. : సీతా. సీతా (వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.)

సెక్ర : అవును సార్, పొరపాటున గాజు పెట్టెలోంచి కిందబడిన మన సీత మీరు విస్కీ తాగి తప్పటడుగులు వేస్తూ లోపలికి వెళ్ళినప్పుడు మీ బూటుకాలికింద పడి చితికిపోయింది. ఈ సంగతి వెంటనే తెలిస్తే మీరు పిచ్చివాళ్ళయిపోతారనీ, చినబాబు మానసికంగా ఒంటరివాడయిపోతాడనీ భయపడి, నేనే మరొక పీతని మన సీతలాగా తయారుచేసి పెట్టెలో వుంచాను. ఈ రహస్యం మీకు తెలియకూడదనే సీత ఆరోగ్యం బాగాలేదని చెప్పాను. అన్ని కార్యక్రమాలూ రద్దుచేశాను.

రామ : అవును, కార్యక్రమాలన్నీ రద్దయిపోయాయి. చినబాబూ మన కార్యక్రమాలన్నీ రద్దయిపోయాయి కవిగారూ, మీ సినిమా పాటలూ రద్దయిపోయాయి. భూపతీ నీ బాకీకూడా తీరకుండానే రద్దయిపోతోంది నీ ఉద్యోగం, ఈ ఆఫీసూకూడా ఈ క్షణంనుంచి రద్దయిపోయింది సెక్రటరీ....సీతా, నా సీతా....

చి. బా. : సీతా, నా సీతా.

(చినబాబు, రామచంద్రుడు డార్క్‌లోకి వెళ్ళిపోయారు. మిగిలినవారు వివిధ భంగిమలలో నిలబడిపోయి వున్నారు. "సీతా, ఓ సీతా కోరస్-నాగిన్ ట్యూన్, పోలీస్ సైరనూ, రేడియో ప్రకటనలూ - నా టి క లో




యింతకిముందు వచ్చిన సౌండ్స్ అన్నీ ఇంటర్ కట్స్‌తో వినబడుతుంటాయి కాసేపటికి రంగస్థలం అంతా చీకటై పోయి, పోర్ ఫ్రంట్‌లో మాత్రం మసక వెలుతురు వస్తుంది. నాగిన్ ట్యూను వినవస్తూ వుంటుంది. ఆర్. ఎఫ్ లో తొలిసారి కనిపించిన స్కూలు యూనిఫారంలోనే చిన్నబాబు మోకాళ్ళ మీద కూర్చుని సిగరెట్టు అట్టలతో చేసిన పెట్టి ముందు వేణువు వాయిస్తూ వుంటాడు రామచంద్రుడుకూడ తొలి దుస్తుల్లోనే తొలిసారివలెనే వంగి చూడడానికి ప్రయత్నిస్తూ వుంటాడు. వాళ్ళిద్దరూ నిశ్చలనంగా వుండగా తెర పడుతుంది.

(నాగిన్ ట్యూను తెరపడిన తరువాత కూడా వినిపిస్తూనే వుంటుంది)

(తుది పలుకు : దాదాపు దశాబ్దం క్రితం కి. శే. అనిసెట్టి సుబ్బారావు నాకొక కథ చెప్పారు. విని ఆలోచనలో పడ్డాను. మిస్. లూసిల్లె ఫ్లెచర్ అనే అమెరికన్ రచయిత్రి రాసిన చిన్నకథ అది. ఆ కథని ఆమె రెండో ప్రపంచ యుద్ధం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో రాసింది. అంటే సరిగ్గా నాలుగు దశాబ్దాల క్రితం! తరువాత దానిని రేడియోకి, ఆ తరువాత సినిమాకీ అనువుగా మలిచారు. ఆ కథలోని వ్యంగ్యవస్తువు నన్ను బాగా ఆకర్షించింది. ఆ క్లూతో ఒక నాటిక రాయాలని అనిసెట్టిగారు అనుకునేవారట! డబ్బింగ్ సినిమాల హడావుడిలో పడి ఆయన అది రాయలేకపోయినందుకు బాధపడేవారు. నేనాయనతో కలిసి పనిచేసినన్నాళ్ళు నన్ను పోరేవారు, రాయమని-ఆయన దగ్గర వుండగా నేనాపని చేయలేకపోయాను. ఇప్పుడైనా, రంగస్థల నటులూ, నా ప్రియమిత్రులూ వి.బి. శంకరరావు గారు నా గొంతుమీద కూచుని యిది రాయించారు సంవత్సరం క్రితం. లూసిల్లె ఫ్లెచర్ నుంచి నేను తీసుకుంది కేవలం రేఖామాత్రమైన ఆలోచనే అయినా, ఆలోచనే రచనకి లోచనం కనుక లూసీకి నేను కృతజ్ఞుణ్ణి. -రచయిత)